

ఆందోళన చేస్తున్న రైతులను శాంతింపజేస్తున్న సీఐ రవీందర్

## మద్దతు ధరకోసం వేరుశనగకు నిప్పు

- **అచ్చంపేటలో రోడ్డెక్కిన రైతులు.. సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు**

అచ్చంపేట, ఫిబ్రవరి 7: వేరుశనగ ధర ఒక్క రోజులోనే భారీగా పడిపోవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం రూ.8 వేలకుపైగా పలికిన క్వింటా పల్లీ ధర.. మరుసటి రోజుకే రూ.వెయ్యి తగ్గడంతో అచ్చంపేట, ఉప్పునుంతల మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 421 మంది రైతులు మార్కెట్ కార్యాలయం ఎదుట గంటపాటు బైఠాయించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని రోడ్డుపై వేరుశనగ పంటను నడిరోడ్డుపై పోసి నిప్పు పెట్టారు.సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



వేతనాల కోసం ఆందోళన చేస్తున్న కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు

## మూడు నెలలుగా వేతనాల్లేవ్!

- **ఖమ్మం జిల్లా ప్రధాన దవాఖాన ఎదుట అవుట్ సోర్సింగ్ సిబ్బంది ధర్నా**

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 7: మూడు నెలలుగా వేతనాలు లేక అల్లాడుతున్నామని ఖమ్మం జిల్లా ప్రధాన దవాఖానలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం వారు వివిధ కార్మిక సంఘాలతో కలిసి దవాఖాన ఎదుట ధర్నా నిర్వహించారు. జీతాల విషయమై ప్రశ్నిస్తే అటు కాంట్రాక్టర్, ఇటు అధికారులు తప్పించుకునే ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సుమారు రెండు గంటలపాటు ధర్నా చేపట్టడంతో రోగులతోపాటు వైద్యులు, వైద్యసిబ్బందికి ఆటంకం కలిగింది. రెండు వారాల్లోగా వేతనాలు ఇప్పిస్తామని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో అమర్‌సింగ్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.




పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

## అర్హులందరికీ 'దళితబంధు' ఇవ్వాలి

- **పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ నేతల దీక్ష**

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 7: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) (సీపీఐ అనుబంధం) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఒక్కరోజు దీక్ష చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు దళితబంధు పథకాన్ని కొనసాగించాలని కోరారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని, మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతి రోజైన బుధవారం దళితులంతా ఐక్యంగా దీక్ష చేశారని సదానందం గుర్తుచేశారు.

### లోకం పోకడ




ఇంకో ఛాన్స్ ఇవ్వు..!



సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నేతన్నలు

## బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వండి

- **482 కోట్ల బకాయిలు విడుదల చేయాలి**
- **సిరిసిల్ల పట్టణంలో నేతన్నల ధర్నా**

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి తమకు ఉపాధి చూపాలని డిమాండ్ చేస్తూ నేతన్నలు ఆందోళనకు దిగారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయం ఎదుట బుధవారం తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసాములు, మరమగ్గాల కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నదని, కార్మికులకు ఉపాధి లేక పస్తులుండే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ రూ.482 కోట్లు వెంటనే టెస్కో సంస్థకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిధులు ఇవ్వక పోవడం వల్లే బతుకమ్మ చీరల ఆర్డర్లు రావడం లేదని అన్నారు. ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే ఆర్డర్లు వచ్చేవని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు ఆర్డర్లు ఇవ్వకపోవడంతో నేత కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సిరిసిల్లలో యారన్ బ్యాంకు ఏర్పాటు చేయాలని, 10 హెచ్‌పీల వరకు మరమగ్గాలకు ఉచిత కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేతన్నల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, సీఐటీయూ నాయకులు ఉడుత రవి తదితరులు పాల్గొన్నారు.

# బడి పిల్లలకు స్నాక్స్ బంద్

- **పదో తరగతి పరీక్షల వేళ సర్కారు కాఠిన్యం**
- **కడుపులు మాడ్చుకుని స్పెషల్ క్లాసులకు హాజరు**
- **9 కోట్లతో స్నాక్స్ అందించిన కేసీఆర్ సర్కారు**
- **ఈ ఏడాది ఎగనామం పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం**
- **దాతల కోసం టీచర్ల వెదుకులాట**
- **చందాలేసుకుంటున్న ఉపాధ్యాయులు**



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): పదో తరగతి స్పెషల్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ అందజేసే పథకానికి రేవంత్‌రెడ్డి సర్కారు ఎగనామం పెట్టింది. దీంతో పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులు కడుపు మాడ్చుకుని స్పెషల్ క్లాసులకు హాజరవ్వాల్సిన పరిస్థితి తలెత్తింది. విద్యార్థుల బాధ చూడలేక కొన్ని పాఠశాలల్లో టీచర్లు, హెచ్ఎంలే తలా కొంత వేసుకుని స్నాక్స్ తెప్పిస్తున్నట్టు సమాచారం. మరికొన్ని స్కూళ్లల్లో దాతలు ముందుకొచ్చి అక్కడక్కడ చేయూతనందిస్తున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. జనవరి నెల నుంచి ఉదయం, సాయంత్రం రెండు పూటలా స్పెషల్ క్లాసులు ఉంటాయి. దీంతో విద్యార్థులు ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పాఠశాలల్లోనే గడపాల్సి వస్తున్నది. వీరికి మధ్యాహ్న భోజనం పెడుతున్నప్పటికీ ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ లేకపోవడంతో కడుపుమాడ్చుకునేవారు. కాలే కడుపులతో చదువుల మీద శ్రద్ధ పెట్టలేకపోయేవారు. ఈ విషయాన్ని గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం నిరుడు స్నాక్స్ పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని సర్కారు స్కూళ్లు, మాడల్ స్కూళ్లలోని 1.89 లక్షల విద్యార్థులకు రూ.9.67 కోట్లు వెచ్చించి ఉచితంగా స్నాక్స్‌ను సమకూర్చింది. ఒక్కో విద్యార్థికి రోజుకు సగటున రూ.15 చొప్పున ఖర్చుచేసి వేడివేడి స్నాక్స్‌ను అందజేసింది. ప్రోటీన్లతో కూడిన ఉడికించిన శనగలు, బొబ్బర్లు, అనుములు, పల్లీలు-బెల్లంముద్దలు, ఉడికించిన కోడిగుడ్లు, సమోసాలు, పకోడి, అరటిపండ్లు వంటివి సమకూర్చింది. విద్యార్థులు ఉత్సాహంగా స్పెషల్ క్లాసులకు హాజరవ్వడంతో ఉత్తీర్ణతలో మంచి ఫలితాలొచ్చాయి. ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది అటకెక్కించింది.

**ఇదీ పరిస్థితి...**

- సర్కారు స్నాక్స్‌ను బంద్‌పెట్టడంతో పిల్లల ఆకలి తీర్చేందుకు అక్కడక్కడ దాతలు ముందుకొస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియోజకవర్గ పరిధిలోని పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్‌ను సమకూర్చేందుకు తన వేతనంలో నుంచి కొంత విరాళంగా అందజేశారు.
- ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పష్టతరాకపోవడంతో కరీంనగర్ జిల్లాలో స్థానికంగా ఉన్న ఆర్థిక వనరుల నుంచి రోజుకు రూ.10తో అటుకులు, ఉప్మా వంటి వాటిని అల్పాహారంగా అందించేందుకు విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకుంటున్నారు.
- హైదరాబాద్‌లో హిల్‌స్ట్రీట్ పాఠశాలలో 43 మంది పదో తరగతి విద్యార్థులుండగా, ప్రస్తుతం టీచర్లే తలా కొంత వేసుకుని స్నాక్స్‌ను అందిస్తున్నారు.
- ఆదిలాబాద్ జెడ్పీహెచ్ఎస్ గుడిహత్నూర్‌లో 25 మంది విద్యార్థులుండగా.. వీరంతా కడుపుమాడ్చుకునే స్పెషల్ క్లాసులకు హాజరవుతున్నారు. దాతలు ముందుకు రావాలని గణతంత్ర దినోత్సవంనాడు గ్రామ ప్రజలను కోరినా ఎవరూ ముందుకురాలేదు.
- చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 53 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. వీరికి స్నాక్స్‌ను అందజేయకపోవడంతో కడుపుమాడ్చుకునే క్లాసులు వింటున్నారు. ఇదే పరిస్థితి దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్నది.

## టీఎస్‌పీఎస్సీకి 40కోట్లు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): టీఎస్‌పీఎస్సీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.40 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు రెండు వేర్వేరు ఉత్తర్వులను విడుదల చేశారు. రూ.39 కోట్లు విడుదల చేస్తూ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌వో)ను విడుదల చేయగా, కోటి రూపాయ మరో బీఆర్‌వోను రామకృష్ణారావు విడుదల చేశారు.

## సీబీఐ కేసుల వాదనకు స్పెషల్ పీపీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): హైకోర్టులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తరఫున కేసుల్లో వాదనలు వినిపించేందుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)లను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు న్యాయవాదులు సృజన్‌కుమార్ రెడ్డి, శ్రీనివాస్ కపాటియా నియమితులయ్యారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 16.2°c | 38.2°c |
| ఆదిలాబాద్ | 16.6°c | 36.6°c |
| మెదక్ | 18.3°c | 37.5°c |
| ఖమ్మం | 20.0°c | 36.0°c |
| నల్లగొండ | 20.4°c | 38.3°c |
| హైదరాబాద్ | 21.2°c | 36.2°c |
| కరీంనగర్ | 22.0°c | 35.0°c |
| మహబూబ్‌నగర్ | 22.1°c | 37.0°c |
| నిజామాబాద్ | 22.5°c | 35.7°c |
| వరంగల్ | 23.0°c | 35.0°c |

## స్వాతంత్య్ర సమరయోధురాలి మృతి



మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 7: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు వంగపల్లి రాజమ్మ (83) మరణించారు. రాజమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సిద్దిపేటలోని సర్కార్ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. బైరాన్‌పల్లిలో రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో రాజమ్మ ప్రత్యక్షంగా పాల్గొన్నట్టు గ్రామస్థులు గుర్తుచేశారు. రాజమ్మకు కుమారుడు, ఐదుగురు కూతుళ్లు ఉన్నారు. రాజమ్మ మృతికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## భోజనంలో మెనూ పాటించడం లేదు

- **నాణ్యత లేని ఆహారం తినలేకపోతున్నామని ఆవేదన**
- **కలెక్టరేట్‌కు కాలినడకన వెళ్లిన గురుకుల విద్యార్థులు**
- **మార్గమధ్యంలో అడ్డుకున్న పోలీసులు, అధికారులు**



కడుపునిండా భోజనం పెట్టడం లేదంటూ ఖాళీ ప్లేట్లు చూపిస్తున్న విద్యార్థులు

ధరూరు, ఫిబ్రవరి 7: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి.. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు మెరుగైన విద్యను అందించింది. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు రోడ్డెక్కే పరిస్థితి నెలకొన్నది. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం ర్యాలంపాడు రిజర్వాయర్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న కేటీదొడ్డి మండలానికి చెందిన బీసీ గురుకుల పాఠశాల విద్యార్థుల ఆవేదనే అందుకు నిదర్శనం. ఇందులో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో భోజనంలో మెనూ పాటించడం లేదని, సగం సగం భోజనం పెట్టడంతో కడుపు మాడ్చుకొని చదవుకుంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఓపిక నశించిన విద్యార్థులు.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం కాలినడకన కలెక్టరేట్‌కు బయలుదేరారు. విషయం తెలుసుకున్న ఎస్సై విజయ్‌కుమార్ ధరూరు మండల కేంద్ర శివారులో విద్యార్థులను అడ్డుకున్నారు. విద్యార్థుల సమస్యలను ఎస్సై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిణి శ్వేతాప్రియదర్శిని, ఎంఈవో సురేశ్‌లు అక్కడికి చేరుకొని విద్యార్థులతో బూరెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో చర్చలు జరిపారు. ఇప్పటినుంచి మెనూ ప్రకారం కడుపునిండా భోజనం పెట్టేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు తిరిగి పాఠశాలకు చేరుకున్నారు.



టీఎస్ఆర్టీసీ కానిస్టేబుల్‌కు నియామకపత్రం అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జనార్


## సందడిగా ఆర్టీసీ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్

- **8వ బెటాలియన్‌లో 80 మంది శిక్షణ పూర్తి**
- **నియామక పత్రాలను అందజేసిన మంత్రి పొన్నం, సంస్థ ఎండీ సజ్జనార్**

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): కొత్తగా టీఎస్ఆర్టీసీ కుటుంబంలో చేరిన కానిస్టేబుళ్లు నిబద్ధతతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో బుధవారం టీఎస్ఆర్టీసీకి చెందిన 80 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ సందడిగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం, సంస్థ ఎండీ సజ్జనార్ కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారికి నియామకపత్రాలను అందజేశారు. కారుణ్య నియామకం కింద నియమితులైన 80 మంది కానిస్టేబుళ్లలో 47 మంది పురుషులు, 33 మంది మహిళలు ఉన్నారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ 8వ బెటాలియన్‌లో పోలీస్‌శాఖ సహకారంతో వీరికి ఒక నెల శిక్షణ ఇచ్చారు. వారంతా శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీలో కారుణ్య నియామకాల కింద 1,700 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు తెలిపారు. తాజాగా 813 మంది నియామక ప్రక్రియ రెండు వారాల్లో పూర్తి అవుతుందని పేర్కొన్నారు. టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. కొత్త రక్తంతో సంస్థ మరింత అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. శిక్షణలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఎం శిరీష (బెస్ట్ ఆల్‌రౌండర్), సంకీర్తన (బెస్ట్ ఇండోర్), శిరీష, రిత్విక్ (బెస్ట్ ఔట్‌డోర్)లకు ట్రోఫీలను అందజేశారు. పాసింగ్ ఔట్ పరేడ్‌లో టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, ఈడీ (అడ్మిన్) కృష్ణకాంత్, 8వ బెటాలియన్ కమాండెంట్ సన్నీ, అదనపు కమాండెంట్ నారాయణ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 ఉద్యోగాలకు వయోపరిమితి పెంపు

- **రెండేండ్లు పెంచుతున్నట్టు రేవంత్ ప్రకటన**
- **త్వరలో 15 వేల పోలీసు నియామకాలు**
- **సింగరేణి జాబ్ మేళాలో 441 మందికి ఉద్యోగ నియామకపత్రాల అందజేత**



బుధవారం సచివాలయంలోని అంబేద్కర్ మెమోరియల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సింగరేణి జాబ్‌మేళాలో ఉద్యోగ నియామకపత్రం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): త్వరలోనే గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ఈ ఉద్యోగాలకు రెండేండ్ల వయోపరిమితి ఇవ్వనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయంలోని అంబేద్కర్ మెమోరియల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సింగరేణి జాబ్‌మేళాలో 441 మందికి సీఎం కారుణ్య నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ పోస్టులను త్వరలోనే భర్తీచేస్తామని తెలిపారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీచేస్తామని, నిరుద్యోగులు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు ద్వారా 15రోజుల్లో 15వేల పోలీ సులు నియామకాలు చేపడతామని పేర్కొన్నారు.

**కేసీఆర్ కొలువులు**
**కాంగ్రెస్ కాగితాలు**

**సింగరేణిని కంటికిరెప్పలా కాపాడుకుంటాం**

రాష్ర్టానికి తలమానికమైన సింగరేణి సంస్థను కంటికిరెప్పలా కాపాడుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ముందుంటుందని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పట్ల మానవీయంగా వ్యవహరిస్తుందని, కార్మిక హక్కులు కాపాడుతూ ప్రజా పాలనను అందిస్తామని తెలిపారు. పారదర్శకంగా నియామకాలు చేస్తామని చెప్పామని, దీంట్లో భాగంగానే అంబేద్కర్ సాక్షిగా 441 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించినట్టు చెప్పారు. బొగ్గు బావులు సింగరేణికే చెందేలా కేంద్రంతో మాట్లాడుతున్నామని తెలిపారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి సింగరేణి సంస్థను ప్రభుత్వం కాపాడుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, వినోద్, వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన చర్యలు

- **టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్**

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ)/ ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజల మధ్య విధులు నిర్వహించే టీఎస్ఆర్టీసీ సిబ్బందిపై దాడులు, దౌర్జన్యాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. దుండగుల చేతిలో దాడికి గురైన ఆర్టీసీ సిబ్బందిని హైదరాబాద్ తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలో బుధవారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితితోపాటు దాడి జరిగిన తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ కండక్టర్ రమేశ్, డ్రైవర్ షేక్ అబ్దుల్‌కు ఆర్టీసీ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. దాడిలో తీవ్రగాయాలపాలైన కండక్టర్ రమేశ్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

## విద్యార్థినుల ఆత్మహత్యపై కోర్టుకు ఆధారాలు

- **యాదాద్రి జోన్ డీసీపీ రాజేశ్‌చంద్ర**

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య కేసులో ఆధారాలను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పిస్తామని యాదాద్రి జోన్ డీసీపీ రాజేశ్‌చంద్ర తెలిపారు. బుధవారం ఆయన భువనగిరిలో మీడియాతో మాట్లాడారు. ఆత్మహత్యలకు సంబంధించి 36/24 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించామని, పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిందని పేర్కొన్నారు. కేసుకు సంబంధించి కొంతమంది సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టడం దురదృష్టకరమని, విచారణ జరుగుతున్నప్పుడు అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదని సూచించారు. అన్ని స్టేట్‌మెంట్లను వీడియోతీశామని, ఆధారాలను కోర్టుకు సమర్పిస్తామని స్పష్టం చేశారు. సున్నితమైన విషయాలను బయటకు వెల్లడించలేమని, సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పిస్తామని స్పష్టం చేశారు.

### నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

**స్పెషలిస్ట్ పోస్టులు**

కేంద్రంలోని వివిధ శాఖల్లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 69
- పోస్టులు: గ్రేడ్ –3 స్పెషలిస్ట్, సైంటిస్ట్ బీ, అసిస్టెంట్ డైరెక్టర్
- విభాగాలు: న్యూరో సర్జన్, నెఫ్రాలజీ, కార్డియాలజీ, సివిల్ ఇంజినీర్, అఫీషియల్ లాంగ్వేజ్, జనరల్ సర్జరీ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 15
- వెబ్‌సైట్: https://www.upsconline.nic.in

**ఎన్‌డీఏలో..**

పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో గ్రూప్ సీ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 198
- పోస్టులు: ఎల్‌డీసీ, స్టెనోగ్రాఫర్, కుక్, కార్పెంటర్, ఫైర్‌మ్యాన్, ఎంటీఎస్ తదితరాలు
- అర్హతలు, వయస్సు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 22
- వెబ్‌సైట్: https://ndacivrect.gov.in

**నీట్ ఎండీఎస్-2024**

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)- ఎండీఎస్ 2024 నోటిఫికేషన్‌ను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ విడుదల చేసింది.

- పరీక్ష పేరు: నీట్ ఎండీఎస్ –2024
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 19
- వెబ్‌సైట్: https://natboard.edu.in

**ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్**

**పోటీ పరీక్షల ప్రత్యేకం**

- బయాలజీ, కరెంట్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.